

రుణమాఫీ కోసం సంప్రదించాలి

వికారాబాద్, ఆగస్టు 19: రుణమాఫీ కాని రైతులు మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల కేంద్రాన్ని సంప్రదించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్ సూచించారు. ఇప్పటి వరకు రూ.2లక్షల లోపు ఉన్న రైతులకు రుణమాఫీ వర్తించిందని తెలిపారు. వివిధ కారణాల వల్ల అర్హులైన రైతులు రుణమాఫీ కాకపోతే వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో తమ సమస్యలను తెలపాలని సూచించారు.



బొంపల్లిలో చిన్నారుల రాఖీ సంబురం



ఎమ్మెల్యే మల్లారెడ్డి నివాసంలో రాఖీ వేడుకలు



స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను ఆశీర్వదిస్తున్న సోదరీమణులు

వేడుకగా 'రక్షా బంధన్'

నువ్వు నాకు రక్ష- నేను నీకు రక్ష.. జీవితాంతం ఒకరికి ఒకరం అండ అంటూ అక్కాచెల్లెళ్ల, అన్నాదమ్ముల మధ్య సహృద భావాన్ని చాటే పండగే రాఖీ. ఈ వేడుకను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సోమవారం వైభవంగా జరుపుకున్నారు. ఆడపడుచుల రాకతో ఇళ్లన్నీ కళకళలాడాయి. చిన్నాపెద్దల కోలాహలంతో సంతోషంగా రాఖీ పండుగను జరుపుకున్నారు. ఆడపచులు రాఖీ కట్టగా.. సోదరులు కానుకలు సమర్పించి, కాళ్లు మొక్కి ఆశీర్వాదం తీసుకున్నారు. ఎమ్మెల్యేలకు మంత్రి సీతక్క రాఖీని కట్టగా, మహిళా ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే మల్లారెడ్డి నివాసానికి వెళ్లి రాఖీలు కట్టారు. నీళ్లపల్లి ఏకాంబర రామలింగేశ్వరాలయం భక్తజనంతో పోటెత్తింది.



బషీరాబాద్ : రామలింగేశ్వరాలయంలో భక్తుల బారులు

సాగు వర్రీ!



ఉమ్మడి జిల్లాలో వరి సాగుకు తీవ్ర ప్రతికూల పరిస్థితులు కనిపిస్తున్నాయి. అదను దాటిపోతున్నా ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాలో సాధారణ సాగులో కనీసం సగం కూడా సాగవ్వలేదు. ప్రభుత్వం సన్నాలకు బోనస్ ఇస్తామన్నా.. రైతులు అటువైపు మొగ్గు చూపడంలేదు. ఈ ఏడాది వర్షాలు బాగానే పడినప్పటికీ భూగర్భజలాలు ఆశించిన స్థాయిలో పెరగలేదు. రాష్ట్రంలోనే అతి తక్కువ భూగర్భజలాలు ఉన్న జిల్లాల్లో మూడు జిల్లాలు(రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్) ఉండటం గమనార్హం. భూగర్భజలాలు పెరగకపోవడంతో పాటు చెరువులు, కుంటలు సైతం నిండని పరిస్థితి. దీంతో వరిసాగు విషయంలో రైతులు వెనుకంజ వేస్తున్నారు. గతేడాది పత్తికి అధిక ధర పలకడంతో వరిని వదిలి పత్తి సాగువైపు చూస్తున్నారు. వికారాబాద్‌లో ఇప్పటికే సగటుకు మించి రైతులు పత్తి సాగు చేశారు.

వరిసాగుకు ప్రతికూల పరిస్థితులు » సగం విస్తీర్ణం కూడా పూర్తికాని సాగు

- ఇంకా కేవలం రెండువారాలే సమయం
- పెరగని భూగర్భజలాలే ప్రధాన కారణం
- సన్నాలకు బోనస్ ఇస్తామన్నా పత్తివైపే మొగ్గు
- మిగతా పంటలపైనా వాతావరణ పరిస్థితుల ప్రభావం
- వికారాబాద్ జిల్లాలో అత్యధిక సాగు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

ఈ వానాకాలం సీజన్‌లో వరి సాగు గణనీయంగా పడిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. సాగు సమస్యలతో పాటు వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో ఉమ్మడి జిల్లాలో వరిసాగుపై తీవ్ర ప్రభావం పడింది. వరి సాగుకు సమయం దగ్గరపడుతున్నా సగం విస్తీర్ణంలో కూడా ఇంత వరకు నాట్లు పడలేదు. సన్న రకాల వరిని సాగు చేసే రైతులకు ప్రభుత్వం బస్తాకు రూ.500 బోనస్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ ప్రకటనతో ఉమ్మడి జిల్లాలో ఈ వానాకాలంలో వరి విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉందని అందరూ భావించారు. అయితే ప్రస్తుత పరిస్థితి చూస్తే సగటు విస్తీర్ణంలో 75 శాతం కూడా సాగయ్యే అవకాశాలు కనిపించడం లేదు.

వెనుకంజ వేస్తున్న రైతన్నలు

గతేడాది ఉమ్మడి జిల్లాలో రైతులు సగటుకు మించి వరి సాగు చేశారు. వికారాబాద్ జిల్లాలో ఏకంగా 30శాతం అధికంగా రైతులు వరి పండించారు. ఈ ఏడాది వర్షాలు బాగానే పడినప్పటికీ ఉమ్మడి జిల్లాల్లో భూగర్భజలాలు ఆశించిన స్థాయిలో పెరగలేదు. రాష్ట్రంలోనే అతి తక్కువ భూగర్భజలాలు ఉన్న జిల్లాల్లో ఈ మూడు జిల్లాలు(రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్) ఉన్నాయి. ఈ ఏడాది వికారాబాద్ జిల్లాల్లో రికార్డు స్థాయిలో వర్షాలు కురిశాయి. ఇప్పటి వరకు దాదాపు 20శాతం అధిక వర్షపాతం నమోదైంది. కానీ ఇక్కడ గత ఏడాది ఇదే సమయంతో పోలిస్తే దాదాపు రెండున్నరశాతం భూగర్భజలాలు తక్కువగా నమోదయ్యాయి. భూగర్భజలాలు పెరగకపోవడంతో పాటు చెరువులు, కుంటలు సైతం నిండలేదు. దీంతో వర్షాధార పంటైన వరిని సాగు చేసే విషయంలో రైతులు వెనకంజ వేస్తున్నారు. ఈ కారణంగా ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. ఉమ్మడి జిల్లాలో పత్తివైపు రైతులు ఎక్కువ మొగ్గు చూపుతున్నారు.





1.10 లక్షల ఎకరాల్లో కంది

సాధారణంగా కంది, మొక్కజొన్న పంటలు కూడా ఉమ్మడి జిల్లాలో అధిక విస్తీర్ణంలో రైతులు సాగు చేస్తుంటారు. కానీ ఈ సీజన్‌లో ఇంకా సగం విస్తీర్ణంలో కూడా మొక్కజొన్న పంట సాగు చేయలేదు. అలాగే రంగారెడ్డి జిల్లాలో కంది పంట సగం విస్తీర్ణంలో కూడా సాగు చేయలేదు. అయితే ఇదే సమయంలో వికారాబాద్‌లో కంది పంట సాగు ఆశాజనకంగా ఉంది.. ఇక్కడ సగటు ఈ సీజన్‌లో లక్షన్నర ఎకరాల్లో కంది పంట వేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 1.10 లక్షల ఎకరాల్లో కంది పంట సాగు చేశారు.

మరింత పెరిగే అవకాశం

వికారాబాద్‌లో ఇప్పటికే సగటుకు మించి రైతులు పత్తి సాగు చేశారు. ఇంకా మరికొంత విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. ఇక్కడ సగటు వానాకాలం సీజన్‌లో 2,31,338 ఎకరాల విస్తీర్ణంలో పత్తి సాగు చేస్తుండగా ఇప్పటికే 2,41,592 ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేశారు. ఇక రంగారెడ్డి జిల్లాలో సగటు 1,77,735 ఎకరాల్లో పత్తి సాగు చేస్తుండగా ఇప్పటికి 1,09,877 ఎకరాల్లో పత్తి పంట వేశారు. వాస్తవానికి గత ఏడాది పత్తికి మంచి గిట్టుబాటు ధర లభించడంతో ఈ ఏడాది పత్తిసాగు మరింత పెరిగే అవకాశాలు ఉన్నట్లు ముందుగానే అంచనా వేసిన ప్రభుత్వం ఈ మేర ప్రణాళిక సిద్ధం చేసింది. గత ఏడాది పరిస్థితులు దృష్టిలో పెట్టుకుని 20శాతం పత్తి పంట సాగు లక్ష్యాలను పెంచింది. ప్రభుత్వం భావించిన విధంగానే ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో రైతులు పత్తి పంటనే అధికంగా సాగు చేస్తున్నారు.





మూడు జిల్లాల్లో వానాకాలం సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)

జిల్లా	సాధారణ సాగు	ప్రస్తుత సాగు	శాతం
రంగారెడ్డి	3,96,899	1,95,018	49.14
వికారాబాద్	5,77,508	4,65,171	80.55
మేడ్చల్	23,026	11,222	48.74



మంబాపూర్‌లో తాగునీటి కోసం రోడ్డుపై బైఠాయించిన ప్రజలు

తాగునీటి కోసం రోడ్డెక్కిన జనం

- సరఫరా కాని భగీరథ నీరు.. పని చేయని బోర్లు
- మంబాపూర్, పర్వత్‌పల్లి వాసుల అవస్థలు

పెద్దేముల్/బషీరాబాద్, ఆగస్టు 19: తాగునీటి కోసం వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం మంబాపూర్ వాసులు రోడ్డెక్కారు. తాండూరు-హైదరాబాద్ రోడ్డుపై బైఠాయించి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ప్రత్యేకాధికారుల పాలనలో అధికారులు జనం సమస్యలు పట్టించుకోవడం లేదంటూ మండిపడ్డారు. ఈ గ్రామంలో మూడు రోజులుగా మిషన్‌భగీరథ నీటి సరఫరా నిలిచిపోయింది. గ్రామంలోని దళితవాడలో ఉన్న రెండు బోర్లు కూడా చెడిపోయి రెండు నెలలు కావస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో మూడు రోజుల నుంచి నీటిసరఫరా నిలిచిపోయి జనాలకు నీటి కటకట ఏర్పడింది. రోజువారీ అవసరాలకు కూడా నీళ్ల లేకపోవడంతో దళితవాడ ప్రజలంతా ఖాళీ బిందెలు తీసుకుని రోడ్డుపైకి వచ్చారు. తాండూరు-హైదరాబాద్ రోడ్డుపై బైటాయించి రాస్తారోకో చేశారు.విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ రేగొండి శ్రవణ్‌కుమార్ మెకానిక్‌కును తీసుకుపోయి రెండుబోర్లకు మరమ్మతులు చేయించారు. దీంతో వారు ధర్నాను విరమించారు. కాగా, బషీరాబాద్ మండలంలోని పర్వత్‌పల్లిలో ప్రజలకు తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. మూడు రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరాను నిలిపివేయడంతో నీటి ఇబ్బందులు మరింత పెరిగాయి. గ్రామంలో మల్లన్నగుడి దగ్గర పని చేస్తున్న బోరు వద్దకు తెల్లవారక ముందే గుమిగూడి బిందెలతో తాగునీటిని తెచ్చుకుంటున్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



పర్వత్‌పల్లిలో తాగునీటి కోసం బోరు వద్ద గుమిగూడిన ప్రజలు

మేడం.. ఎప్పుడొస్తారో?



- మేడ్చల్ తహసీల్దార్ కార్యాలయంలో నిలిచిన రిజిస్ట్రేషన్లు
- దీర్ఘకాలిక సెలవుల్లో ఎమ్మార్వో శైలజ
- పని నిమిత్తం వచ్చిన వారు పడిగాపులు

7

మరో అవకాశం



- నేటి నుంచి ఓటరు జాబితా
- సవరణ ప్రక్రియ ప్రారంభం
- ఇంటింటికీ వెళ్లనున్న బీఎల్‌వోలు

వాన.. వరద



ఆమనగల్లులో జలమయమైన అంతర్గత రోడ్డు

- సంకిరెడ్డిపల్లిలో పిడుగుపడి విద్యార్థి మృతి
- ఎయిర్‌పోర్టు టర్మినల్‌లోకి వరద నీరు
- 2 గంటల్లో 35.2 మి.మీ వర్షపాతం నమోదు
- విమానాశ్రయంలో ఇబ్బంది పడిన ప్రయాణికులు
- మల్కాజ్‌గిరి వాగులో కొట్టుకుపోయిన ఎడ్లబండి
- గిరిగేట్‌పల్లిలో వరద ఉధృతికి అదుపు తప్పిన ఆటో

వికారాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి)/తాండూరు రూరల్/మర్పల్లి : ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల సోమవారం ఓ మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. రహదారులు జలమయం కాగా, చెరువులు, కుంటల్లోకి వరద నీరు చేరింది. వాగులు ఉధృతంగా ప్రవహించాయి. వికారాబాద్ పట్టణంలో గంట పాటు భారీ వర్షం కురియగా, ఇతర ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది. రాత్రి 8 గంటలకు వరకు జిల్లాలో అత్యధికంగా పుట్టపహడ్‌లో 20.5 మి.మీ. వర్షం కురిసింది. వికారాబాద్‌లో 17.5 మి.మీ., వికారాబాద్ మండలం, మదన్‌పల్లిలో 17.3 మి.మీ., మద్గుల్ చిట్టంపల్లిలో 17.0 మి.మీ., ధారూరులో 13.5 మి.మీ., మన్నేగూడలో 7.5 మి.మీ., బషీరాబాద్‌లో 4.5 మి.మీ., మోమిన్‌పేట్‌లో 2.3 మి.మీ., మర్పల్లిలో 1.8 మి.మీ.వర్షం కురిసింది.

పొలంలో ఉండగానే పిడుగు

పిడుగుపడి విద్యార్థి మృతి చెందిన ఘటన తాండూరు మండలం సంకిరెడ్డిపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన ఘడి సింగాపురం విట్టప్ప, పద్మమ్మ కుమారుడు కార్తీక్(14) జినుగుర్తి జెడ్పీహెచ్ఎస్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. సోమవారం రాఖీ పౌర్ణమి సందర్భంగా పాఠశాలకు సెలవు కావడంతో తమ పొలంలో పెసరకాయ తెంపేందుకు వెళ్లాడు. భారీ వర్షం కురివడంతో కార్తీక్ పొలం వద్దనే ఉండిపోగా పిడుగుపడింది. తాండూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే కార్తీక్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అలాగే మర్పల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. పంట పొలాల్లోకి వరద నీరు చేరింది. మల్కాజ్‌గిరి గ్రామంలోని వాగు ఉధృతంగా ప్రవహించింది. గ్రామానికి చెందిన రైతు సంగయ్య వరద ఉధృతి పెరగడంతో వాగు దాటే పరిస్థితి లేక ముందే ప్రమాదాన్ని గుర్తించి కాడెద్దులను బండి నుంచి పక్కకు తీశాడు. బండి మాత్రం వాగులో కొట్టుకుపోయింది.



ఎయిర్‌పోర్టు టర్మినల్‌లో నిలిచిన వర్షపు నీరు

తృటిలో తప్పిన ప్రమాదం..

వరద నీటి ప్రవాహానికి అదుపు తప్పిన ఓ ఆటోకు తృటిలో ప్రమాదం తప్పింది. వికారాబాద్ నుంచి గిరిగెట్‌పల్లి వెళ్లే మార్గంలో రైల్వే బ్రిడ్జి కింద నుంచి వాగులో వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో గిరిగెట్‌పల్లి నుంచి వికారాబాద్ వైపు వస్తున్న ఓ ఆటో అదుపు తప్పింది. పక్కనే చెట్ల పొదలు ఉండడంతో ఆ ఆటోకు ప్రమాదం తప్పింది. చెట్ల పొదలు లేకపోతే ఆటో వరద నీటిలో కొట్టుకుపోయేది. ఆ సమయంలో ఆటోలో డ్రైవర్‌తో పాటు మరో ముగ్గురు ప్రయాణికులు ఉన్నట్లు తెలిసింది.



మల్కాజ్‌గిరి వాగులో కొట్టుకుపోయిన ఎడ్ల బండి

రెండు గంటల పాటు దంచికొట్టిన వాన

శంషాబాద్ రూరల్/మొయినాబాద్ రూరల్/ఆమనగల్లు : గతంలో ఎప్పుడూ లేని విధంగా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో సోమవారం మధ్యాహ్నం 2 గంటల పాటు భారీ వర్షం కురిసింది. కాగా, 35.2మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఎయిర్‌పోర్టు వర్గాలు వెల్లడించాయి. టర్మినల్ వద్దకు భారీగా వర్షం నీరు చేరడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన జీఎంఆర్ అధికారులు వర్షపు నీటిని వెంటనే తొలగించేందుకు ఏర్పాటు చేశారు. మరోసారి ఇలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రతలు తీసుకుంటామని అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టర్మినల్ (ఎయిర్‌పోర్టు విలేజ్)లోకి వర్షపు నీరు రావడంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ విమానాశ్రయంలో ఇలాంటివి జరగడం దురదృష్టకరమని ప్రయాణికులు వాపోయారు. ఎయిర్‌పోర్టుతో పాటు చుట్టుపక్కల పలు గ్రామాల్లోనూ భారీ వర్షం నమోదైంది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. మట్టి రోడ్లన్ని చిత్తడిగా మారాయి. తీవ్ర ఎండలతో ఊపిరి సలపనివ్వకుండా ఉడికి పోతున్న సమయంలో మొయినాబాద్ మండల ంలో చిరుజల్లులతో వర్షం పడింది. దీంతో ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు ఉపశమనం లభించింది. ఈసీ, మూసీ వాగులు ప్రవహించకపోవడంపై కూడా ప్రజలకు ఒకింత ఆందోళన వ్యక్తం చేశారు. ఆమనగల్లు పట్టణంలో భారీ వర్షం కురిసింది. గంట పాటు కురిసిన వర్షానికి అంతర్గత రోడ్లు జలమయమయ్యాయి. పలు చోట్ల లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచింది.

ఘనంగా గాయత్రీధారణ యజ్ఞం

మార్కండేయ ఆలయంలో నూలుపూర్ణిమ గాయత్రీధారణ

ఆమనగల్లు, ఆగస్టు 19: మార్కండేయ ఆలయంలో నూలుపూర్ణిమ గాయత్రీధారణ యజ్ఞాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వహించిన యజ్ఞంలో ఆమనగల్లు, వివిధ గ్రామాల పద్మశాలీలు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పద్మశాలీ సంఘం అధ్యక్షుడు ఎంగలి బాలకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం గాయత్రీ యజ్ఞం అనంతరం నూలుపూర్ణిమ గాయత్రీధారణ వేడుక నిర్వహించారు. ఉత్సవాలానంతరం సామూహిక రక్షాబంధనం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్‌బీసీ మాజీ సభ్యుడు ఆచారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గుజ్జరి ప్రవీణ్ దంపతులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ దుర్గయ్య, చేనేత సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, సంఘ నాయకులు శ్రీను, శివలింగం, సత్యరాములు, పున్న శ్రీను, ఈశ్వరయ్య, రవి, సురేష్, శ్రీధర్, నిరంజన్, గుజ్జరి ప్రవీణ్, ఏలే శివలింగం, సోమశంకర్ పాల్గొన్నారు.



ఆమనగల్లులో గాయత్రిధారణలో పద్మశాలీలు

మడేలేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు

ఆమనగల్లు, ఆగస్టు 19: ఆకుతోటపల్లిలో నిర్మించిన మడేలేశ్వరస్వామి, ఈదమ్మ ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ఠ వేడుకలను సోమవారం నిర్వహించారు. రజక సంఘం అధ్యక్షుడు మాచర్ల రాంచంద్రయ్య, ఆలయ చైర్మన్ మల్లేష్‌ల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. అర్చకులు విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేశారు. కార్యక్రమంలో ఎస్‌బీసీ మాజీ సభ్యుడు ఆచారి, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. దైవ కార్యక్రమాల్లో ప్రతీ ఒక్కరు పాలుపంచుకోవాలని వారు కోరారు. నాయకులు రజిత, మంగమ్మ, నారాయణ, శేఖర్‌గౌడ్, వేణు, యాదయ్య, వెంకటయ్య, రాములు, శ్రీను, శేఖర్, చెన్నయ్య రవి, కిష్టయ్య, చిన్న కిష్టయ్య పాల్గొన్నారు.

కార్యాలయాలకు భవనాలు మంజూరు చేయండి



మంత్రి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్, ఆగస్టు 19: షాద్‌నగర్ నియోజకవర్గంలోని జిల్లేడు చౌదరిగూడ, నందిగామ తహసీల్దార్ కార్యాలయాలకు భవనాలు మంజూరు చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. సోమవారం హైదరాబాద్‌లో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అద్దె భవనాల్లో ప్రజలు, సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. భవనాల నిర్మాణానికి రూ.20కోట్లు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. త్వరలోనే మంజూరు చేస్తామని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పాల్గొన్నారు.

అభిషేక్ మనూ సింఘ్వీని కలిసిన ఎమ్మెల్యే



అభిషేక్ మను సింఘ్వీకి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని పరిచయం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఆమనగల్లు, ఆగస్టు 19: కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సోమవారం కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థి అభిషేక్ మనూ సింఘ్వీని మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఓ కార్యక్రమంలో ఎమ్మెల్యేను మను సింఘ్వీకి పరిచయం చేశారు.

సంఘాలు గ్రామాభివృద్ధికి పాటుపడాలి

మొయినాబాద్ రూరల్, ఆగస్టు 19: యువజన సంఘాలు గ్రామాభివృద్ధికి పాటుపడాలని కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీం భరత్, మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్‌రెడ్డి అన్నారు. హిమాయత్‌నగర్ మైనారిటీ యువజన సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన కరీం కార్యవర్గ సభ్యులతో కలిసి సోమవారం వారిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. భీంభరత్, సీఐలు నూతన కార్యవర్గాన్ని అభినందించారు. గ్రామానికి మంచి పేరుతెచ్చేలా యువజన సంఘాలు కృషిచేయాలన్నారు. ఆర్యక్రమంలో అతిక్, మహ్మద్ అలీ, మిరాజ్, వజీర్, రజాక్ తదితరులు ఉన్నారు.



భీం భరత్‌ను కలిసిన మైనారిటీ సంఘం సభ్యులు

రాజ్యసభ అభ్యర్థి సింఘ్వీకి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి శుభాకాంక్షలు

తాండూరు, ఆగస్టు 19: కాంగ్రెస్ పార్టీ తెలంగాణ నుంచి రాజ్యసభ అభ్యర్థిగా సీఎల్పీ సమావేశంలో ఎంపికైన అభిషేక్ మనుసింఘ్వీకి తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో ఆయన సోమవారం సింగ్విని కలిశారు.



అభిషేక్ సింఘ్వీకి శుభాకాంక్షలు తెలుపుతున్న తాండూరు ఎమ్మెల్యే

డీపీఆర్వో ఫొటోగ్రాఫర్‌కు సన్మానం



సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా నగరంలోని గ్రీన్ పార్క్ హోటల్‌లో ఉత్తమ ఫొటోగ్రాఫర్లను సన్మానించారు. ఇందులో భాగంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా డీపీఆర్వో ఫొటోగ్రాఫర్ కిషోర్ బాబును సమాచారశాఖ కమిషనర్ ఎం.హనుమంతరావు శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. *- మేడ్చల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి)*

ప్రజావాణిలో ఫిర్యాదులను పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

మేడ్చల్ ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని మేడ్చల్ అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో డీఆర్డీవో హరిప్రియతో కలిసి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి ప్రజలు అందిస్తున్న ఫిర్యాదులపై సంబంధిత అధికారులు సత్వరమే స్పందించి పరిష్కరించాలన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 29ఫిర్యాదులు అందినట్లు అధికారులు వెల్లడించారు.

అపరిష్కృత సమస్యలు త్వరగా పరిష్కరించాలి

వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, ఆగస్టు 19: అపరిష్కృతంగా ఉన్న సమస్యలను సత్వరమే పరిష్కరిస్కారానికి అధికారులు కృషి చేయాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ఫిర్యాదులను స్వీకరించారు. రెవెన్యూ సమస్యలపై వచ్చే దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం దిశగా పనిచేయాలని అధికారులకు సూచించారు. రెవెన్యూ సమస్యలపై నేరుగా తహసీల్దార్లతో మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. రుణమాఫీపై వచ్చిన దరఖాస్తులను వ్యవసాయాధికారులు పరిశీలించి తగుచర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. అంతకుముందు అదనపు కలెక్టర్ అధికారులకు రక్షాబంధన్ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

సాంకేతిక రంగంలో మార్పులకు అనుగుణంగా బోధించాలి



మేడ్చల్ టౌన్, ఆగస్టు 19: సాంకేతిక రంగంలో చోటుచేసుకుంటున్న విప్లవాత్మకమైన మార్పులకు అనుగుణంగా అధ్యాపకులు బోధించాలని ఓయూ ఇంజినీరింగ్ కళాశాలల డైరెక్టర్ ఉమా విశ్వేశ్వరావు అన్నారు. కండ్లకోయ సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం అధ్యాపకుల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఆరురోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భూపాల్‌రెడ్డి, సీహెచ్ శ్రీశైలంరెడ్డి, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు



మన్‌సాన్‌పల్లి చౌరస్తాలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

మహేశ్వరం, ఆగస్టు 19: మద్యం తాగి వాహనాలను నడపొద్దని, రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ వాహనదారులు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మన్‌సాన్‌పల్లి చౌరస్తాలో డ్రంకెన్ డ్రైవ్, సైబర్‌క్రైమ్, డ్రగ్స్ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీఐ వాహనదారులతో మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనాలు నడిపితే రోడ్డు ప్రమాదాలు జరిగి కుటుంబాలు పెద్దదిక్కును కోల్పోతున్నాయన్నారు. కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వడంతోనూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. సైబర్ నేరాలపై ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచితులకు ఫోన్ నెంబర్లు ఇవ్వొద్దని, ఓటీపీలు వేరే వారికి ఎప్పుడూ చెప్పొద్దన్నారు. యువకులు, విద్యార్థులు డ్రగ్స్‌కు, గంజాయి సేవనానికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై వెంకట్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా వెంచర్ ఏర్పాటు

చర్యలు తీసుకోని అధికారులు



అక్రమ వెంచర్ ఇదే

మాడ్గుల, ఆగస్టు 19: మండలంలోని కొల్కులపల్లి శివారు సాగర్ హైవే పక్కన 42పి, 43పి, 44పి సర్వే నంబర్లలోని పదెకరాల భూమిలో అక్రమంగా వెంచర్ చేస్తున్నారు. 'శ్రీ అరుణోదయ ఇన్ఫ్రా గ్రూప్' పేరుతో వెంచర్ చుట్టూ జెండాలు పాతి ప్లాట్లు చేస్తున్నారు. కళ్లముందే అక్రమంగా వెంచర్‌ను ఏర్పాటు చేస్తూ అమాయకులను బురిడీకొట్టించే పనులు చేస్తున్నా రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. దీనిపై ఎంపీవో వేజన్నను స్పందన కోరగా వెంచర్‌దారులకు పంచాయతీ కార్యదర్శి నోటీసిచ్చారని, వారు ఇంతవరకు స్పందించలేదన్నారు. జెండాలను, ఫ్లెక్సీలకు తొలగిస్తామని ఆయన చెప్పారు. ఈ వెంచర్‌లో ప్లాట్లు ఎవరూ కొనొద్దని ప్రజలకు సూచించారు.

మరో అవకాశం

- నేటి నుంచి ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ప్రారంభం
- ఇంటింటికీ వెళ్లనున్న బీఎల్‌వోలు



మేడ్చల్ ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఓటరు జాబితా సవరణకు ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. స్పెషల్ సమ్మరీ రివిజన్-2024లో భాగంగా ఓటరు జాబితా తయారు చేయనున్నారు. ఈ ప్రక్రియ ఈనెల 20వ తేదీ నేటి నుంచి ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేసింది. బూత్ స్థాయి అధికారులు(బీఎల్‌వో) ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తారు. ఇప్పుడున్న జాబితాలో పేర్లు ఉన్నవారు శాశ్వతంగా ఎక్కడైనా వెళ్లిపోయారా, చనిపోయారా, పేర్లలో తప్పులు ఉన్నాయా అని తెలుసుకుంటారు. ఇప్పటికీ జాబితాలో పేరు లేకుంటే వారి నుంచి దరఖాస్తు తీసుకుంటారు. ఈ ప్రక్రియలో తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. ఓటరు జాబితా ముసాయిదాను అక్టోబరు 29న ప్రకటిస్తారు.

అభ్యంతరాలు పరిశీలన..

ముసాయిదా ఓటరు జాబితా ప్రకటించిన తర్వాత అభ్యంతరాలు, సవరణ, పరిశీలనకు అవకాశం ఉంటుంది. ఇందుకు అక్టోబరు 29 నుంచి నవంబరు 28 వరకు అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తారు. వాటిని మరోసారి క్షేత్రస్థాయికి వెళ్లి డిసెంబరు 24వ తేదీలోపు పరిష్కరిస్తారు. అనంతరం అధికారులు తుది జాబితాను 2025 జనవరి 6వ తేదీన ప్రకటిస్తారు.

యువత నమోదు చేసుకోవాలి

18ఏళ్లు నిండిన వారు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉంది. ఇప్పటి వరకు ఓటు హక్కు లేని వారు ఫారం- 6 దరఖాస్తును స్థానిక బీఎల్‌వోలకు అందజేయవచ్చు. దీంతో పాటు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. దేశ భవిష్యత్తు అయిన యువత ఓటరుగా తమ పేరు నమోదు చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఓటరు జాబితా సవరణలో భాగంగా నియోజకవర్గంతో పాటు జిల్లా స్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలు తీసుకుంటాం. *- అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి*

మేడం.. ఎప్పుడొస్తారో?

మేడ్చల్ తహసీల్దార్ కార్యాలయంలో ఆగిన రిజిస్ట్రేషన్లు

దీర్ఘకాలిక సెలవు పై వెళ్లిన ఎమ్మార్వో శైలజ

మేడ్చల్ టౌన్, ఆగస్టు19: తహసీల్దార్ దీర్ఘకాలిక సెలవు పెట్టడంతో మేడ్చల్ తహసీల్దార్ కార్యాలయంలో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. పని నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలు మేడం వచ్చారా? అని కార్యాలయంలో కనపడిన సిబ్బందిని అడగటం...రాలేదని చెప్పడంతో ఉట్టి చేతులతో వెను తిరగడం కొద్ది రోజులుగా పరిపాటిగా మారింది. అనారోగ్యం కారణంగా ఈనెల 5వ తేదీన సెలవు పెట్టి వెళ్లింది. దీంతో కార్యాలయంలో పనులు ఎక్కడికక్కడే స్తంభించి పోయాయని స్థానికులు వాపోతున్నారు. రెండు వారాలుగా తహసీల్దార్ లేక కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు పూర్తిగా నిలిచిపోయాయి. తహసీల్దార్ దీర్ఘకాలిక సెలవు పట్ల కార్యాలయం సిబ్బందికి సరైన సమాచారం లేక పోవటంతో పని నిమిత్తం కార్యాలయానికి వచ్చేవారు పడిగాపులు కాస్తున్నారు. ప్రతీ రోజు సుమారు ఐదు రిజిస్ట్రేషన్లు జరగాల్సి ఉండగా పూర్తిగా నిలిచిపోయాయి. తహసీల్దార్ ఎప్పుడు విధుల్లో చేరుతారన్న కచ్చితమైన సమాచారం లేక పోవడంతో చాలా మంది రిజిస్ట్రేషన్ స్లాట్లను రద్దు చేసుకుంటున్నారు. ఇన్‌చార్జి తహసీల్దార్‌ను నియమించక పోవడంతో పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్ కుమార్‌కు రిజిస్ట్రేషన్లు తప్పా, ఇతర అదనపు బాధ్యతలు అప్పగించినట్టు తెలిసింది.

దీర్ఘకాలిక సెలవు పై అనుమానాలు

విధి నిర్వాహణలో ఆరోపణలు ఎదుర్కొంటున్న మేడ్చల్ తహసీల్దార్ శైలజ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లటం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నతాధికారులకు సమాధానం ఇవ్వలేక ఆమె సెలవు పెట్టినట్టు కార్యాలయం సిబ్బందే గుసగుసలాడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు మేడ్చల్ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన శైలజపై ఈ మధ్యకాలంలో అనేక ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆమెపై కొందరు ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసిన దాఖలాలున్నాయి.ఆమె ఉన్నత అధికారులకు జవాబు ఇవ్వలేక బదిలీ కోసం యత్నిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా శైలజపై ఆరోపణల నేపథ్యంలో ఉన్నత అధికారులు ఇప్పటికే విచారణ ప్రారంభించారు.



మల్లారెడ్డిగూడలో బోనాలతో మహిళలు, గ్రామస్తులు



కొందుర్గులో బోనాలతో మహిళలు

ఘనంగా పోచమ్మ బోనాలు

షాబాద్, ఆగస్టు 19: మండలంలోని మలారెడ్డిగూడ, సంకేపల్లిగూడ, గోపిగడ్డ గ్రామాల్లో పోచమ్మ బోనాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. శివసత్తుల పూనకాలతో, పోతరాజుల విన్యాసాలు, యువకులు కేరింతలతో ఘనంగా బోనాలు, తొట్టెల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు.

కొందుర్గులో మైసమ్మ బోనాలు

కొందుర్గు: మండల కేంద్రంలో సోమవారం మాలకుంట్ల మైసమ్మ అమ్మవారికి బోనాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే గ్రామస్తులు ఆలయానికి వచ్చి నైవేద్యం సమర్పించి, మొక్కులను తీర్చుకున్నారు. సాయంత్రం గ్రామంలోని పురవీధుల గుండా మహిళలు బోనాలతో ఊరేగింపుగా బయలుదేరారు. ఆలయానికి చేరుకున్న తర్వాత ప్రదక్షిణలు చేసి, బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ రాజేశ్ పటేల్, పటేల్ వీరన్న, పటేల్ ప్రభులింగం, పటేల్ శ్రీశైలం, పటేల్ సతీష్, రవిశంకర్, ప్రవీణ్, చంద్రశేఖర్, శరణప్ప, మల్లేశ్, నర్సింలు, కృష్ణయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్-గూడూర్ రోడ్డుకు మోక్షమెప్పుడో?

అడుగడుగునా గోతులు.. ఇబ్బందుల్లో వాహనదారులు



గోతుల మయమైన తిమ్మాపూర్-గుడూర్ రోడ్డు

కొత్తూర్, ఆగస్టు 19: అడుగడునా గోతులు, కిలో మీటర్‌కో మలుపులతో తిమ్మాపూర్-గూడూర్ రోడ్డు వాహనదారులు, ప్రజలకు ప్రాణసంకటంగా మారింది. తిమ్మాపూర్ నుంచి గూడూరు మీదుగా మక్తగూడ వరకు 6కిలోమీటర్ల రోడ్డు గోతుల మయంగా మారింది. ఇటీవలి వర్షాలకు గుంతల్లో నీరు నిలిచి వాహనాలు నడపలేదని పరిస్థితి ఏర్పడింది. 20సంవత్సరాల క్రితం వేసిన రోడ్డుకు ఇప్పటి వరకు మళ్లా బీటీ వేయలేదు. మరమ్మతులూ చేయలేదు. దీంతో భారీ గోతులు ఏర్పడ్డాయి. ఈ రోడ్డు నుంచే శంషాబాద్, షాబాద్ ప్రాంతాలకు వెళ్తుంటారు. దీంతో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది. పరిశ్రమలు ఉండడంతో భారీ వాహనాలు వచ్చిపోతుంటాయి. అలాగే కిలో మీటరుకు ఓ మలుపు ఉండడంతో మలుపుల వద్ద వాహనచోదకులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని నడపాల్సి వస్తోంది. రాత్రి సమయాల్లో ప్రమాదం మరీ ఎక్కువగా ఉంది. రోడ్డు ఇంత అధ్వానంగా తయారైనా పట్టించుకునే నాథుడు లేకుండా పోయాడని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలి



గూడూర్ రోడ్డులో ఏర్పడిన గోతులు నరకాన్ని తలపిస్తున్నాయి. భారీ గోతులతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిపూట ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నాం. తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు వెంటనే స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలి. *- చిర్ర మధుసూదన్‌రావు, ఏఎంసీ డైరెక్టర్*

వ్యాపార, ఆర్థిక సంబంధాలు బలపడాలి

కజికిస్థాన్ కాన్సుల్ నవాబ్‌మీర్ నాసీర్ అలీకాన్



సమావేశమైన మ్యాక్ ప్రాజెక్టు ఎండీ నాసర్ అలీకాన్

మహేశ్వరం, ఆగస్టు 19: కజికిస్థాన్, తెలంగాణ మధ్య వ్యాపార, ఆర్థిక, సాంస్కృతిక సంబంధాలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగనున్నట్లు ఆ దేశ కాన్సుల్ డాక్టర్ నవాబ్ మీర్ నాసీర్ అలీఖాన్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని మ్యాక్ ప్రాజెక్టులో కజికిస్థాన్‌లోని అస్తానా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు మేనేజ్‌మెంట్ బోర్డు చైర్మన్ యూసూఫ్ అల్దాదర్‌తో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాసీర్‌అలీ ఖాన్ మాట్లాడుతూ అల్దాదర్ అస్తానా అంతర్జాతీయంగా 12 విమానాశ్రయాలను నిర్వహిస్తున్నారన్నారు. తెలంగాణను వ్యాపార రంగంలో మరింత ముందుకు తీసుకుపోవాలని తమ దేశ ప్రతినిధులకు సూచించామన్నారు. సమావేశంలో కజికిస్థాన్, కెనడా దేశస్తుల ప్రతినిధులతో పాటు జీఎంఆర్ ఇంటర్నేషనల్ ఉయాంర్ పోర్టు చీఫ్ ఆపరేటింగ్ అధికారి ఆశిష్‌కుమార్‌ఐక్యరాజ్యసమితి మాజీ డైరెక్టర్ మొయిన్‌కరీం పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో ఆనందమయ జీవనం



ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న వెంకటయ్య, నాయకులు

ఆమనగల్లు, ఆగస్టు 19 : ఆధ్యాత్మిక చింతనతో ఆనందమయ జీవనం పొందొచ్చని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. దైవ కార్యక్రమాల్లో ప్రతీ ఒక్కరు పాలుపంచుకోవాలని కోరారు. ఆమనగల్లులోని కట్టమైసమ్మ ఆలయంలో ఈ నెల 21 నుంచి 23 వరకు విగ్రహప్రతిష్ఠ వేడుకలు నిర్వహిస్తున్నారు. వేడుకల ఆహ్వాన పత్రికను సోమవారం ఆలయ చైర్మన్ మొక్తాల వెంకటయ్య ఎమ్మెల్యేకు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దైవ కార్యక్రమాలు సమాజ శాంతి, మానవాళి సన్మార్గ పురోగమానానికి దోహదపడుతాయన్నారు. ప్రజలు దైవ చింతనతో ముందుకు సాగాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం పురాతన ఆలయాల పురుద్ధరణ, దైవ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ముదిరాజుల, మత్స్యకార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని నారాయణరెడ్డి పేర్కొన్నారు. విగ్రహ ప్రతిష్ఠ వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెంకటయ్య తెలిపారు. కార్యక్రమంలో రాజు, మహేష్, యాదయ్య, అంజయ్య, సాయి పాల్గొన్నారు.



కాశీ విశ్వనాథస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న చైర్‌పర్సన్ లావణ్య

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

కొత్తూర్, ఆగస్టు 19: ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్యదేవేందర్‌యాదవ్ అన్నారు. శివనగర్‌లోని శ్రీ కాశీవిశ్వనాథ ఆలయంలో బిహారీలు శ్రావణ పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లావణ్య హాజరై పూజల్లో పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు వై.రవీందర్‌యాదవ్, గణేష్, శ్రీనివాస్, అశోక్, నర్సింహాగౌడ్, యాదయ్య, రాఘవేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీలో అడ్మిషన్లకు గడువు పొడిగింపు


చేవెళ్ల, ఆగస్టు 19: బీసీ గురుకుల ఫైన్ ఆర్ట్స్ డిగ్రీ మహిళా కళాశాలలో ప్రవేశాలకు ప్రభుత్వం గడువు పొడిగించిందని ప్రిన్సిపాల్ జి.నర్సింలు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. చేవెళ్లలోని మోడల్ కాలనీలో కొత్తగా బీసీ గురుకుల ఫైన్ ఆర్ట్స్ డిగ్రీ మహిళా కళాశాల ప్రారంభమైందన్నారు. దీనిలో బీఏ యానిమేషన్, వీఎఫ్‌ఎక్స్ కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 24వ తేదీ వరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. ఇంటర్ పూర్తిచేసిన యువతులు బీసీ గురుకుల వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు చేయాలని సూచించారు. వివరాలకు 9063264463/9063242329 అనే నంబర్లలో సంప్రదించాలన్నారు.

భక్తిశ్రద్ధలతో శివ పారాయణం



శివ పారాయణం చేస్తున్న పద్మశాలి సంఘం సభ్యులు

కేశంపేట, ఆగస్టు 19: నిర్దవెల్లిలో సోమవారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శివపారాయణం నిర్వహించారు. హనుమాన్ ఆలయంలో శివాభిషేకం, గీతాపారాయణం, సహస్రనామ పారాయణం, హనుమాన్ చాలీసా పఠన కార్యక్రమాలు నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు పల్లాటి కృష్ణయ్య ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, రామలింగం, అశోక్, ఆంజనేయులు, యాదయ్య కృష్ణయ్య, శేఖర్, రమేష్ పాల్గొన్నారు.



వేంకటేశ్వరుడి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు

వైభవంగా వేంకటేశ్వరుడి కల్యాణోత్సవం



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 19: షాద్‌నగర్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు నేతృత్వంలో ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌కుమార్‌రెడ్డి, న్యాయవాది బి.జగన్‌మోహన్‌రెడ్డి దంపతులు స్వామి వారి కల్యాణాన్ని జరిపించారు. ప్రధాన పూజారి శ్రీనివాసచార్యులు, వేదపండితులు స్వామి కల్యాణోత్సవ వైశిష్ట్యాన్ని భక్తులకు వివరించారు. గర్భగుడి నుంచి వేంకటేశ్వరుడు, శ్రీదేవి, భూదేవి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో మండపం వద్దకు ఎదుర్కోళ్లతో తీసుకొచ్చారు. మండపం చుట్టూ అరటి చెట్లు, రాతి మండపానికి పూల అలంకరణ, లైట్ల వెలుతురులో స్వామి కల్యాణాన్ని వందలాది మంది భక్తుల సమక్షంలో జరిపించారు. అనంతరం భక్తులకు అక్షింతలు, తిరుపతి లడ్డు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఉత్సవాలకు పట్టణ ప్రముఖులు, వేలాది మంది భక్తులు తరలివచ్చారు.

వైభవంగా ఉర్సే షరీఫ్ ఉత్సవాలు



భక్తులతో కిటకిటలాడిన దర్గా

తాండూరు, ఆగస్టు 19: తాండూరు పట్టణం బస్వన్నకట్ట ప్రాంతంలో ఉన్న హజ్రత్ సయ్యద్ అబ్దుల్ కరీమ్ సాహెబ్ ఉర్సే షరీఫ్ ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం రాత్రి, సోమవారం ఉత్సవాలను నిర్వాహకులు కనుల పండువగా నిర్వహించారు. ముత్తవల్లి సయ్యద్ అబ్దుల్ గని పాషా ఆధ్వర్యంలో రెండు రోజులుగా ఈ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం రాత్రి ప్రధాన ఘట్టమైన గంధం కార్యక్రమాన్ని వేలాది మంది భక్తుల మధ్యన నిర్వహించారు. గంధాన్ని అబ్దుల్ గని పాషా ఇంటి నుంచి దర్గా వరకు సంప్రదాయ రీతిలో ఊరేగింపుగా చేరుకుని దర్గాలో సందల్‌మాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం రాత్రి దీపోత్సవాన్ని ఖవ్వాలి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ అబ్దుల్ సలీం పాషా, సహేబ్ కుబ్దాలు పాల్గొన్నారు. తాండూరు పట్టణంలోని ప్రజలతో పాటు కొడంగల్, సేడం, చిత్తాపూర్, మల్కేడ్, చించోళి, కొస్గి, మద్దూరు, నారాయణ పేట్ నుంచి భక్తులు తరలివచ్చి ఉత్సవాల్లో పాల్గొన్నారు.


మేడ్చల్ టౌన్: ఎంపీ ఈటలను రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి సంస్థ మహిళలు


పరిగి:ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డికి రాఖీ కడుతున్న మంత్రి సీతక్క


వికారాబాద్: గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సనగారి కొండల్‌రెడ్డికి రాఖీ కడుతున్న సోదరి


పూడూరు: మండల పరిధిలోని కడుమూరులో రాఖీలు కడుతున్న చిన్నారులు


తాండూరు రూరల్: హైదరాబాద్‌లో తన సోదరుడు నర్సింహారెడ్డి(బాబు)కి రాఖీ కడుతున్న అక్క మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

అనుబంధాలకు ప్రతీక రక్షాబంధన్


తాండూరు: ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి రాఖీ కడుతున్న పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

ఆత్మీయ అనుబంధాలు, ప్రేమానురాగాలకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకలను వికారాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నా పెద్దా తేడాలేకుండా సోదరీమణులు సోదరులకు సంప్రదాయ బద్ధంగా హారతిచ్చి రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. ఇందుకు సోదరులు నూతన వస్త్రాలు, బహుమతులను కానుకగా అందించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.


వికారాబాద్: మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌కు రాఖీ కడుతున్న అక్కాచెల్లెళ్లు


కొడంగల్: సోదరులకు రాఖీలు కడుతున్న చిన్నారులు


మేడ్చల్: జిల్లా వైద్యాధికారి రఘునాథస్వామికి రాఖీ కట్టి హారతి ఇస్తున్న వైద్యులు


కులకచర్ల: సోదరుడికి రాఖీ కడుతున్న చిన్నారి


శామీర్‌పేట: సోదరితో రాఖీ కట్టించుకుంటున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వైఎస్‌గౌడ్


ఘట్‌కేసర్ రూరల్: సోదరునికి రాఖీ కడుతున్న అవుషాపూర్ మాజీ సర్పంచ్ కావేరిమశ్చేందర్‌రెడ్డి


ఘట్‌కేసర్: తన సోదరులకు రాఖీ కడుతున్న ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్


తాండూరు: ఎంఐఎం కౌన్సిలర్ సాజిత్ ఆలీకి రాఖీ పడుతున్న మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కొట్రిక విజయలక్ష్మి


కొడంగల్ రూరల్: బేకుల్‌కోడ్‌లో తమ్ముడుకి, అన్నకు రాఖీ కడుతున్న అక్క చెల్లెలు


పెద్దేముల్: సోదరుడికి రాఖీ కడుతున్న చెల్లెల్లు


బొంరాస్‌పేట్: సోదరుడికి రాఖీ కడుతున్న సోదరి


తాండూరు: జవాన్‌కు రాఖీ కడుతున్న మహిళ కార్మికులు


మర్పల్లి: మర్పల్లిలో సోదరుడికి రాఖీ కడుతున్న చిన్నారి

భక్తిశ్రద్ధలతో శ్రావణమాస పూజలు


శామీర్‌పేట: భవానీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్న భక్తులు


ధారూరు: వీరభద్రేశ్వర ఆలయంలో శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు

శామీర్‌పేట, ఆగస్టు 19: శ్రావణ మాసం సోమవారం, రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని శామీర్‌పేట శ్రీభవానిరామలింగేశ్వరస్వామి(శివాలయం)లో పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధానర్చకులు గడియారం మురళీధర్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రధానర్చకులు అర్చన, మంత్రపుష్పం, హారతి, తీర్థప్రసాద వితరణ చేశారు.

ధారూరు: ధారూరు వీరభద్రేశ్వర ఆలయంలో శివలింగానికి జలం, పంచామృతంతో అభిషేకం చేసి మారేడు బిల్వాలు, పుష్పాలతో అలంకరించి నైవేద్యం సమర్పించి హారతినిచ్చి మొక్కుకున్నారు. ఆలయంలోని గణపతి, కుమారస్వామి, వీరభద్రేశ్వర, నంద, అమ్మవారి విగ్రహాలకు పూజలు చేశారు.

పెద్దేముల్: తట్టిపల్లి సమీపంలోని అంబురామేశ్వర ఆలయంలో తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ, టీపీసీసీ ప్రధానకార్యదర్శి ధారాసింగ్ అంబురామేశ్వర ఆలయంలో హోమం, అభిషేకాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే అంబురామేశ్వర దేవాలయాన్ని సందర్శించి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు.

బొంరాస్‌పేట్: రాఖీ పౌర్ణమి సందర్భంగా దుద్యాల మండల కేంద్రంలోని శ్రీ మహర్షి యోగానంద స్వామిజీ ఆధ్వర్యంలో అఖండ జ్యోతి కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రతీ సంవత్సరం మాదిరిగానే స్థానిక మఠం నుంచి గ్రామపురవీధుల మీదుగా అఖండ జ్యోతి ఊరేగింపు నిర్వహించారు

బొంరాస్‌పేట్: దుద్యాల మండలంలోని పోలెపల్లి ఎల్లమ్మ ఆలయంలో సోమవారం పౌర్ణమి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొడంగల్ మాజీ ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్ ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అమ్మవారి దర్శనం కోసం దుద్యాల మండలంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. అదేవిధంగా బోడబండ తండాగుట్టపై వెలిసిన వీరభద్రేశ్వరస్వామికి భక్తులు సోమవారం ప్రత్యేకపూజలు చేశారు. మేడిచెట్టు తండా గ్రామ పంచాయతీ పరిధిలోని బోడబండ తండావాసులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజునాయక్, పిత్యానాయక్, హన్యానాయక్, శంకర్ నాయక్, గణేశ్, వినోద్, పవన్ పాల్గొన్నారు.

తాండూరు: శ్రీ భావిగి భద్రేశ్వర దేవాలయంలో కొలువైన శివుడిని వీరభద్రేశ్వరుడి రూపంలో అలంకరించారు. మూడవ శ్రావణ మాసం సోమవారాన్ని పురస్కరించుకొని ఆలయ అర్చకులు పూలు, పండ్లతో ప్రత్యేకంగా అలంకరణ చేశారు.

పాంబండ గిరి ప్రదక్షిణకు పోటెత్తిన భక్తులు

కులకచర్ల: మండలంలోని పాంబండ గిరి ప్రదక్షిణకు భక్తులు పోటెత్తారు. బండవెల్కిర్ల పాంబండ శ్రీ రామ లింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రతీనెల పౌర్ణమి రోజు గిరిప్రదక్షిణలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు శ్రీ రామలింగేశ్వరస్వామిని దర్శించుకొని ప్రత్యేకపూజలు చేశారు.


గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

అరబిక్, తెలుగు నిఘంటువు ఆవిష్కరణ


నిఘంటువును ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

దోమ/పరిగి, ఆగస్టు 19: డాక్టర్ అబ్దుల్ రహీం, మొహ్మద్ మౌలానా రచించిన ప్రపంచంలోనే మొదటి అరబిక్, తెలుగు నిఘంటువును హైదరాబాద్‌లో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అని సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. డాక్టర్ అబ్దుల్ రహీం, మొహ్మద్ మౌలానా ప్రస్తుతం సౌదీ పౌరుడు, దోమ మండలంలోని దిర్సంపల్లి గ్రామ వాసి 1200 పేజీలకుపైగా అద్భుతమైన అరబిక్ తెలుగు నిఘంటువును రచించించారు. ఈ సందర్భంగా డాక్టర్ అబ్దుల్ రహీంను సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు.

మొక్కుబడిగా ప్రజావాణి



ప్రజావాణికి హాజరైన అధికారులు

బషీరాబాద్, ఆగస్టు 19: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి పలు శాఖల అధికారులు రాక, ఫిర్యాదుదారులు లేక వెలవెలబోతూ మొక్కుబడిగా కొనసాగింది. ఈ ప్రజావాణి కార్యక్రమానికి విధిగా మండల స్థాయి వివిధశాఖల అధికారులు విధిగా హాజరై ఫిర్యాదులు స్వీకరించి సమస్యలను పరిష్కారించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేస్తే ఇక్కడి అధికారులు పెడచెవిన పెడుతూ బేఖాతార్ చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రతీ సోమవారం ప్రజావాణికి విధిగా హాజరుకావాల్సిన పలువురు అధికారులు తరుచూ డుమ్మా కొడుతుండటంతో ఫిర్యాదుదారులు కూడా అక్కడ ఎవరూ ఉండరని ఇటువైపు రావడంలేదు. ఇదిలా ఉండగా ప్రజావాణికి ఎలాంటి ఫిర్యాదులు రాలేదని బషీరాబాద్ ఎంపీడీవో గాలియాదయ్య పేర్కొన్నారు.

సంక్షిప్తంగా..

● **శామీర్‌పేట:** తూంకుంట మున్సిపాలిటీలోని శ్రీగాయత్రీ మహాక్షేత్రంలో రాఘవేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు సోమవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలను ఆలయ వ్యవస్థాపకులు, వాక్ బ్రహ్మ శిష్యజనోద్ధారక డాక్టర్ ఎస్‌వీఎల్‌ఎన్ మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు.

● **ఘట్‌కేసర్ రూరల్:** కాచవానిసింగారం దివ్యానగర్‌కు చెందిన అనన్య యూపీఎస్‌సీ అలిండియా మూడో ర్యాంక్ సాధించింది ఐఏఎస్ ఉద్యోగానికి ఎంపికైంది. దీంతో కాలనీవాసులు సోమవారం ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

● **కొడంగల్:** శ్రీ విఖానస మహర్షి జన్మదినం సందర్భంగా కొడంగల్ పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భక్తులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఉత్సవ మూర్తిని తిరుచ్చివేంచెపు చేసి పూలమాలలతో అలంకరించి ఉత్సవం నిర్వహించారు. విశేష అర్చనలు, పూజలు చేశారు.

● **ఘట్‌కేసర్:** పోచారం మున్సిపాలిటీలో పార్కుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. యాదాద్రి పార్కులో సోమవారం ఆయన మున్సిపల్ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు.

● **పరిగి:** కోల్‌కతా మెడికల్ కళాశాలలో వైద్య విద్యార్థినిపై హత్యాచారం చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.వెంకటయ్య ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట సోమవారం నిరసన వ్యక్తం చేశారు.

● **పరిగి:** ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పరిగిలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ జాకర్ మండె డాగురె చిత్రపటానికి ఫొటోగ్రాఫర్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్లు బాల్‌రాజ్, నర్సింహులు, శ్రీనివాస్, సత్యం, వెంకటేశ్, నరేశ్ పాల్గొన్నారు.

● **బొంరాస్‌పేట్/దౌల్తాబాద్:** మహబూబ్‌నగర్ ఎంపీ డీకే.అరుణ మంగళవారం(నేడు) కొడంగల్ నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు బీజేపీ నాయకులు సోమవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. అదేవిధంగా మధ్యాహ్నం 12:30 గంటలకు దౌల్తాబాద్‌లో ఎంపీ పర్యటించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు సతీశ్‌ముదిరాజ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

● **మోమిన్‌పేట్:** బంగ్లాదేశ్‌లో హిందువులు, హిందూ ఆలయాలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ మంగళవారం(నేడు) మండలంలో బంద్ పాటిస్తున్నట్లు హిందూ ఐక్యవేదిక సభ్యులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.


● **ఘట్‌కేసర్ రూరల్:** అంకుశాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల(ఇబ్రహీంపట్నం)లో బీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న జీ ఉషారాణి మెదక్ జిల్లాలో జరిగిన తెలంగాణ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్-2024 పోటీల్లో తృతీయ బహుమతి సాధించినట్లు ప్రిన్సిపాల్ రాధిక తెలుపుతూ అభినందించారు. అదేవిధంగా అథ్లెటిక్స్‌లో తృతీయ బహుమతి సాధించిన ఉషారాణికి ఆమె రూ.1500 నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు.

● **ఘట్‌కేసర్ రూరల్:** ఎదులాబాద్‌లోని కైట్ కాలేజ్‌లో నిర్వహిస్తున్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఇంటర్ కళాశాల (ఉప్పల్)లో టీ అండ్ హెచ్‌ఎం, ఎంఎల్‌టీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు ఉన్నాయని ప్రిన్సిపాల్ వేణుగోపాల్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలకు 7995010644 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

● **ఘట్‌కేసర్:** రాష్ట్రంలో రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాటలతో రైతులను మోసం చేస్తోందని సోమవారం ఎన్‌ఎఫ్‌సీనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలోమాజీ ఎంపీటీసీ మంకం రవి, సహకార సంఘం డైరెక్టర్ చందుపట్ల ధర్మారెడ్డి, మర్పల్లిగూడ బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు చిలుగూరి లక్ష్మణ్ ఆరోపించారు.

● **ఘట్‌కేసర్:** విద్యార్థులు విద్యలో రాణించడానికి నిరంతరం కృషి చేయాలని నల్ల నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల వైస్ చైర్మన్ నల్ల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. చౌదరిగూడలోగల నల్ల నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్సీ మొదటి సంవత్సరం విద్యార్థుల ఒరియేంటేషన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీవీ కృష్ణారెడ్డి, డాక్టర్ జనార్ధన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నేత కన్నుమూత


చీకటిమర్ల విశ్వనాథం

వికారాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ఉమ్మడి రాష్ట్ర దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి సమకాలీకుడు చీకటిమర్ల విశ్వనాథం(100) సోమవారం ఉదయం కన్నుమూశారు. జలగం వెంగళరావు, అంజయ్య, మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రులుగా కొనసాగిన సమయంలో ఆయన కాంగ్రెస్ పార్టీలో కీలక భూమిక పోషించారు. వికారాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి వెన్నుదన్నుగా ఉంటూ వచ్చిన ఆయన వృద్ధాప్య సమస్యలతో గత కొంత కాలంగా రాజకీయాలకు దూరంగా ఉన్నారు. సౌమ్యుడిగా, వివాదరహితుడిగా పేరు తెచ్చుకున్న విశ్వనాథం రాజకీయాలనేవి ప్రజా సేవకోసమేనని నమ్మి ఆచరించిన వ్యక్తిగా గుర్తింపు పొందారు. వికారాబాద్‌లో మర్రి చెన్నారెడ్డి సమకాలీకుల్లో కాంగ్రెస్ పార్టీకి సేవలందించిన సీనియర్ నేతల్లో విశ్వనాథమే చివరివారు. కొంత కాలంగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న చీకటిమర్ల విశ్వనాథం హైదరాబాద్‌లోనే ఉంటున్నారు. సోమవారం సాయంత్రం జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో విశ్వనాథం అంత్యక్రియలు జరిగాయి.

క్రైం కార్నర్

పురుగుల మందు తాగి కార్మికుడి ఆత్మహత్య

తాండూరు రూరల్, ఆగస్టు 19: డబ్బుల కోసం తల్లితో ఫోన్‌లో గొడవపడి ఓ కార్మికుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మండలంలోని అల్లాపూర్ గ్రామానికి చెందిన బుర్రి లాలప్ప నాపరాతి లోడ్ కార్మికుడిగా పనిచేస్తూ తన కొడుకు, కూతురిని పోషిస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం ఫోన్‌లో తల్లితో డబ్బుల విషయంలో గొడవపడ్డాడు. అనంతరం ఇంటికి వచ్చి గుర్తుతెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన కుమారుడు ప్రేమ్‌కుమార్ నాన్న ఏమి తాగావని అడిగినా చూపించలేదు. అప్పటికే స్పృహకోల్పోయి పడిపోయాడు. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం 108లో తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని, మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించాలని వైద్యులు పేర్కొన్నారు. కుటుంబసభ్యులు అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం తరలిస్తుండగా లాలప్ప మార్గమధ్యలో మృతిచెందినట్లు కుటుంబీకులు తెలిపారు. ఇదిలా ఉండగా లాలప్ప భార్య మమత ఏడాది కిందట ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అప్పటి నుంచి లాలప్ప కొడుకు ప్రేమ్‌కుమార్(6), కూతురు ప్రవళిక(5)లను పోషించుకుంటున్నాడు. తండ్రి కూడా మృతిచెందడంతో ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు.

బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తి రిమాండ్

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 19: బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ వ్యక్తిని ఘట్‌కేసర్ పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిస్సాకు చెందిన మైఖేల్(40) ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ కాలనీలో కూలిపనులు చేసుకుంటున్నాడు. ఆదివారం అదేకాలనీకి చెందిన ఓ బాలిక(9)కు చాక్లెట్ ఇస్తానని చెప్పి అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక భయపడి తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మైఖేల్‌ను అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు సీఐ తెలిపారు.

హత్యాయత్నం ఘటనలో ఇద్దరు పోలీస్ సిబ్బందిపై వేటు

పూడూరు, ఆగస్టు 19: బీజేపీ మండల అధ్యక్షుడు రాఘవేందర్‌పై హత్యాయత్నం ఘటనలో ఇద్దరు పోలీసు సిబ్బందిపై ఉన్నతాధికారులు వేటు వేశారు. ఈనెల 16వ తేదీన రాఘవేందర్‌పై హత్యాయత్నం జరిగిన సమయంలో కారులో హెడ్‌కానిస్టేబుల్, హోంగార్డు ఉన్నారని బీజేపీ జిల్లా నాయకులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. బాధితుడు ఇందుకు సంబంధించిన సీసీ పుటేజీలను కూడా సమర్పించారు. విచారణ జరిపిన ఉన్నతాధికారులు ప్రైవేటు వాహనంలో హెడ్ కానిస్టేబుల్ పెంటయ్య, హోంగార్డు ఆంజనేయులు ఉన్నట్లు తేలడంతో వారిని ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

మొరం తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకునేందుకు వెళ్లి..

బీజేపీ మండల అధ్యక్షుడు తుంపల్లి రాఘవేందర్ అక్రమంగా మొరంను టిప్పర్ ద్వారా తరలిస్తున్నాడనే సమాచారంతో పోలీస్ సిబ్బంది వెళ్లగా రాఘవేందర్ హత్యాయత్నం కేసు పెట్టినట్లు పరిగి సీఐ శ్రీనివాస్, చెన్‌గోముల్ ఎస్‌ఐ మధుసూదనరెడ్డి స్పష్టం చేశారు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈనెల 15వ తేదీన అర్ధరాత్రి 11గంటలకు మండలంలోని ఎన్కెపల్లి గ్రామానికి చెందిన తుంపల్లి రాఘవేందర్ అక్రమంగా మొరంను టిప్పర్ ద్వారా తరలిస్తున్నట్లు సమాచారం అందిందని తెలిపారు. వెంటనే పోలీసు సిబ్బంది వెళ్లి మైరాన్ హోం వెంచర్ ఎదుట వికారాబాద్ వెళ్లే మార్గంలో పట్టుకున్నారు. వెంటనే డ్రైవర్ టిప్పర్‌ను అక్కడే వదిలేసి పారిపోయాడు. అనంతరం కడుమూరు ఆనందం అనే వ్యక్తి అక్కడికి వచ్చి రాఘవేందర్ ఇల్లు నేను చూపిస్తానంటూ పోలీసు సిబ్బందిని తన వాహనంలో ఎన్కెపల్లిలోని రాఘవేందర్ ఇంటికి తీసుకెళ్లాడు. రాఘవేందర్ ఇంట్లో లేడని తెలుసుకుని కడుమూరు ఆనందం పోలీసు సిబ్బందిని తిరిగి టిప్పర్ వద్ద దింపేసి వెళ్లాడు. ఇదే విషయమై రాఘవేందర్ మరుసటి రోజు ఉదయం 11గంటల సమయంలో పోలీస్ స్టేషన్‌కు వచ్చి కడుమూరు ఆనందం అనే వ్యక్తి తనను వెంబడించి హత్యాయత్నం చేశాడని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ, ఎస్‌ఐ తెలిపారు.

మద్యం మత్తులో రోడ్డుపై వీరంగం

ధారూరు, ఆగస్టు 19: మద్యం మత్తులో కొంతమంది వ్యక్తులు ధారూరులోని తాండూర్-వికారాబాద్ రోడ్డుపై వైన్స్ ఎదుట వీరంగం సృష్టించారు. పలువురిపై అకారణంగా దాడిచేసి ఓ ఆటోను ధ్వంసం చేశారు. తమ ఇన్నోవా వాహనాన్ని రోడ్డుకు అడ్డంగా పెట్టి వీఐపీ సైరన్ మోగిస్తూ హల్‌చల్ చేస్తూ రోడ్డుపై వెళ్లే వాహనాలను అడ్డుకుని వైన్స్ చుట్టుపక్కల ఉన్న వారిని భయభ్రాంతులకు గురిచేశారు. ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటనపై స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడు ఎండీ.మహ్మద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గాయపడిన మహ్మద్‌ను వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. వైన్స్‌తో పాటు పక్కనే ఉన్న ఇంట్లోని సీసీ కెమెరాలను పరిశీలించి ఆ వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకోవాలని వారు పోలీసులను కోరారు. కాగా ఈ విషయంలో చర్యలు తీసుకోకుండా పోలీసులపై రాజకీయ ఒత్తిళ్లు వస్తున్నట్లు సమాచారం.